# వాగ్దేవి ప్రసాదించిన దివ్యజ్ఞానం

జె. వేణిమాధవి
నేచురలిస్ట్
www.vedicvanas.com



(గత సంచిక తరువాయి)

## సరస్వతీ వనం



కమలా కమలావాసా, కమలోత్పల మాలినీ।
కుముద్వతీ చ కల్యాణీ, కాంతిః కామేశవల్లభా॥

కామేశ్వరీ కమలినీ, కామదా కామబంధినీ ।
కామధేనుః కాంచనాక్షీ, కాంచనాభా కళానిధిః ॥

## ఈజిప్టు దేశపు దివ్యపుష్పం

ఈజిప్టు దేశపు నీలి కలువలకి మన దేశంలోని నీలోత్పలాలకి వృక్ష శాస్త్రరీత్యా స్వల్ప వ్యత్యాసం ఉంది. కానీ మనకి చూసేదానికి ఒకేలా కనిపిస్తాయి. అక్కడివారు ఈ పుష్పాన్ని ఎంతో దివ్యమైందిగా, పవిత్రమైందిగా భావించడం చూడవచ్చు. వారు ఈ మొక్కలని మన దేశంలో వలె ఆహారం, వైద్యం, ఆధ్యాత్మికపరంగా వినియోగించేవారు. ఈ పువ్వు ఉదయాన్నే నీటిపైకివచ్చి వికసిస్తుంది. తిరిగి సాయంత్రం సమయానికి ముడుచుకొంటుంది. ఈవిధంగా మూడు నాలుగు రోజులు ఒకే పువ్వు ముడుచుకోవడం, విచ్చుకోవడాన్ని గమనించినవారు ఈ పుష్పాన్ని సూర్యునితోను, పునర్జన్మతోను పోల్చేవారు. వారి దేవతలకు వీటిని అర్పించేవారు. రాణులు వీటితో అలంకరించుకునేవారు.

శాస్త్ర పరిజ్ఞానం లేని వారికి కలువపువ్వుకి, తామరపువ్వుకి మధ్య వ్యత్యాసం తెలుసుకోవడం కష్టమైన పనే. ఈజిప్టు వారు దీన్ని వాడుక





భాషలో 'బ్లూ లోటస్' అంటే 'నీలిపద్మం' అని వ్యవహరిస్తుంటారు. *(గమనిక : వాస్తవానికి ఇది పద్మంకాదు. పద్మాల్లో నీలం రంగువి అసలు ఎక్కడా వుండవు.)*

**బ్లూ లోటస్ టీ :** ఈజిప్టు దేశంలో ఈ పువ్వులతో టీ చేసి తాగే అలవాటు కొన్ని శతాబ్దాలుగా ప్రాచుర్యంలో వుంది. దానిలో తేనె, నిమ్మరసం కలిపి తాగడం చేత ఆ పువ్వులోని ఔషధగుణాలు మరింత మెరుగైన ఫలితాలనిస్తాయని వారి విశ్వాసం, అనుభవం. అంతేకాకుండా ఈ పువ్వులని నీటిలో 10-12 రోజులపాటు నానబెట్టి చేసిన రసాయనాన్ని కూడా సేవిస్తారు. ఈ రసాయనాలని మోతాదు మించి సేవించడం వల్ల ఉన్మత్త స్థితులకు వెళ్ళే అవకాశం కూడా వుంది. అక్కడి రాజుల సమాధుల్లో అనేక విలువైన వస్తువులతో పాటు ఈ పువ్వులను వుంచడం వల్ల వారు ఈ దివ్య పుష్పాలకు ఇచ్చే ఉన్నతస్థానం మనకు తెలుస్తుంది.

**బ్లూ లోటస్ ఆయిల్ :** ఈ పువ్వుల నుంచి నూనెని కూడా సేకరిస్తారు. అది సున్నితమైన సువాసన కలిగి వుంటుంది. దాన్ని పలు ప్రయోజనాల కొరకు వాడేవారు. ఈ రోజుల్లో దీన్ని ప్రత్యామ్నాయ వైద్య, ఆరోగ్య రంగాలతో పాటు ఆరోమాథెరపీ, ధ్యానం కొరకు కూడా వినియోగి



ప్రతి మనిషికీ కాలమే ఉత్తమ గురువు. ప్రపంచమే ఉత్తమ గ్రంథం.





స్తున్నారు. దీని పరిమళానికి మెదడుని ఉత్తేజపరచి, స్వల్పంగా మత్తు కలిగించి ఒత్తిడిని తగ్గించే లక్షణం వుండటం విశేషం. వీరి నాగరికతలో ఈ మొక్కకి ఎంతో ప్రముఖస్థానం వుంది.





**గౌతమబుద్ధుడు – నీలి కలువలు :** బుద్ధుని పాదాలపై 108 దివ్య చిహ్నాలు వున్నట్లు వారి దివ్యగ్రంథాల్లో ప్రస్తావించడం చూడవచ్చు. వాటిలో నీలోత్పలం ఒకటి కావడం విశేషం. ఇదే విషయాన్ని వివిధ ప్రాంతాల్లోని వర్ణచిత్రాలు, శిల్పాలు, విగ్రహాలపై చూడవచ్చు.

మన దేశంలో ఎలాగైతే శివుడు, సీతారాములు, హనుమంతుడు, కృష్ణుడు మొదలగువారి పాదాల గుర్తులను వివిధ దివ్యక్షేత్రాల్లో చూస్తుంటామో, ఆసియా, జపాన్ దేశాల్లోని వివిధ ప్రాంతాల్లో మూడు వేలకు పైగా బుద్ధుని అడుగుల గుర్తులు వున్నాయి. వీటిలో ఒక్క శ్రీలంకలోనే వెయ్యి వరకు వుండటం గమనార్హం. అవి ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా సూచించబడ్డాయి. పాదాలపై వున్న చిహ్నాలు కూడా ప్రతిచోటా విభిన్నంగా వుంటుంటాయి.







**శ్రీలంకలోని అనురాధపురం – ప్రసిద్ధ బౌద్ధక్షేత్రం :** మనదేశంలోని బోధ్‌గయలో బుద్ధుడు జ్ఞానోదయం పొందిన రావివృక్షం యొక్క శాఖ శ్రీలంకలోని అనురాధపురంలో మహావృక్షమై అలరారుతోంది. గౌతమ బుద్ధుడు మహా పరినిర్వాణం చెందిన పిమ్మట ఆయన సంచరించిన ప్రదేశాలలో పద్మాలు, కలువలు విరివిగా వికసించినట్లు చెబుతారు. అనురాధపురం పరిసర ప్రాంతాల్లో వివిధ వర్ణాల్లో పుష్కలంగా పూస్తున్న పద్మాలు, నీలోత్పలాలు అందుకు తార్కాణం అన్నట్లుంటాయి. మనం ప్రతినిత్యం సాధారణంగా వాడే మల్లి, జాజి, గులాబి, చామంతి, కనకాంబరాల మాదిరిగా ఇక్కడికి వచ్చే భక్తులు బుద్ధునికి వివిధ వర్ణాల తామర, కలువ పువ్వులనర్పిస్తుండటం చూడవచ్చు.

















నీలోత్పలాల రంగుకి మనసుని శాంతపరచే గుణం వుంది. ఎంతో అలజడి ఉద్వేగాలతో వున్నవారికి కూడా ఈ రంగుని చూడటంతోటే ప్రశాంతత కలుగుతుందని చారిత్రక, ఆధునిక అధ్యయనాల్లో చూడ వచ్చు. అంతేకాక దీని పరిమళానికి మనలోని సృజనాత్మక శక్తిని మేల్కొల్పే లక్షణం కూడా వుంది.

**గణేశ పురాణం :** గణేశపురాణం ప్రకారం వినాయకుడు 32 అవతారాల ను ఎత్తినట్లు చెప్పబడింది. వాటిలోని కొన్ని అవతారాల్లో వినాయకుడు నీలికలువను ధరించినట్లు ఆయా వర్ణనల్లో చూడవచ్చు. ఆ అవతార



కోతిమూకలను కూడా వీరసైనికులుగా తీర్చిదిద్దడంలో శ్రీరామచంద్రుని గొప్పదనం వుంది.

చిత్రాలను, వాటిలోని ఒక శ్లోకాన్ని ఇక్కడ చూద్దాం.

ఉచ్ఛిష్ట గణపతి



మహాగణపతి



ఊర్ధ్వ గణపతి



ఉద్దండ గణపతి



**కల్హారామ్బుజ బీజ పూరక గదాదంతేక్షుచాపం శుభం।**
**బిభ్రాణో మనికుంభశాలి కలశం పాశం స్రుణి చాంబకం ।**
**గౌరంగ్య రుచిరారవిందకరయ దేవ్య సమాలింగిథాః।**
**శోణాణదగ శుభమాతనో తు భజతాముద్దండ విఘ్నేశ్వరః।।**

*అర్థం : ఉద్దండ గణపతి పదిహస్తాలు కలిగి వాటిలో కల్హారం (నీలి కలువ), వరికంకులు, శుభకరమైన దంతం, రత్నాల కుండ, కలశం, పాశం, చెరకుగడ, దానిమ్మ, ఆయుధం, పువ్వుల గుత్తి కలిగినవాడై వుంటాడు.*

ఎరుపురంగుతో శోభించే ఇతడు త్రినేత్రుడై ఎడమతొడపై కూర్చున్న దేవిని ఆలింగనం చేసుకొని వుండి, ఆయన్ని పూజించేవారికి అనేక శుభాలను కలిగిస్తాడు.

ఇలా చెప్పుకుంటూ పోతే నీలసరస్వతి స్తోత్రం, సరస్వతీ భుజంగ ప్రయత స్తోత్రం, సరస్వతీ దండకం... ఇంకా అనేక దేవీదేవతల స్తోత్రాల్లో నీలోత్పల ప్రస్తావనలు కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే మనకు తారసపడతాయి. ప్రస్తుతం మన ప్రాంతాల్లోని పర్యావరణ పరిస్థితులను బట్టి చూస్తే ఈ దివ్యమైన నీలోత్పలాలు కొలనులు, చెరువులు, సరస్సుల్లో కంటే మన పురాణాల్లోని శ్లోకాల్లోనే ఎక్కువగా వున్నాయి అనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. మనం మన పిల్లలకి చక్కటి విద్యాబుద్ధులు, వినయ విధేయతలు, చదువు సంస్కారాలు కలగాలని 'సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా' అని మాటలు వచ్చీరావటం తోటే నేర్పించే ప్రయత్నం చేస్తుంటాం కదా. మరి అదేవిధంగా ఆ విద్యల తల్లి వాగ్దేవికి ఎంతో ఇష్టమైన మొక్కలు పువ్వులను కూడా అవకాశం వున్నంతలో పెంచటం లేదా పరిచయం చేసే ప్రయత్నం చేస్తే వారికి ఆ తల్లి అనుగ్రహాన్ని ప్రత్యక్షంగా అందించినవారమౌతాం.

పిల్లల మేధస్సు, తెలివితేటలు మెరుగవ్వాలని, ఏకాగ్రత కలగాలని వివిధ లేహ్యాలు, పొడులు, ఔషధులు, పౌష్టిక ఆహార పదార్థాలు, పళ్ళు మొదలగువాటి వివరాలను తెలుసుకొని మరీ తరచి తరచి కొసరి కొసరి బతిమిలాడి, బుజ్జగించి తినిపిస్తూంటాం. మరి ఇంత ప్రయాసలో కొంత ఆ తల్లికి ఇష్టమైన మొక్కలను అందంగా, ఆహ్లాదంగా, పరిమళభరితంగా, ఆరోగ్యకరంగా పెంచినట్లయితే ఆయా గుణాలను అతి సులువుగా మరింత మెరుగైన స్థాయిలో పొందగలుగుతాం అని మనం ఇప్పటివరకూ చూసిన పురాణగాథలు, వివిధ నాగరికతలు, అధునాత శాస్త్ర పరిశోధనల ద్వారా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ తెలుస్తోంది.

మనం ఇన్నేళ్ళుగా నవరాత్రుల్లోని మూల నక్షత్రంరోజున చేసిన పూజలు, నోములు, ఎన్నో! వసంతపంచమి పూజల పుణ్యఫలితంగానే ఆ కరుణామయి తల్లి అనుగ్రహం మనమీద వుండటం చేతనే ఇవాళ ఈ జ్ఞానం మనకు అందింది. ఇది సార్థకం చెందాలంటే నీలోత్పల మొక్కలు, సరస్వతీవనంలోని వివిధ దివ్యవృక్షాల గురించిన జ్ఞానాన్ని మన పిల్లలు, కుటుంబసభ్యులు, ఇతరులతో పంచుకొని వాటిని అనువైన చోటులో నాటినరోజే సాధ్యపడుతుంది.

వినాయకుడు, శివుడు, విష్ణువు, శ్రీరాముడు, పార్వతి, సరస్వతి, భూదేవి, లలితాత్రిపురసుందరి, రాధాదేవి, గోదాదేవి, మన్మథుడు, బుద్ధుడు, ఈజిప్టు దేవతలు, కాళిదాసు, శివాజీ మహరాజు... ఇలా ఎంతోమంది ఈ నీలోత్పలాల్ని చేతిలో ధరించో, వాటితో పూజలు చేసో మనకి దాని వైశిష్ట్యాన్ని గుర్తుచేస్తున్నారు. ఆయా స్తోత్రాలు విగ్రహాల్లో అక్షర, రాతి, లోహరూపాల్లో నిర్జీవంగా వున్న నీలికలువలకి ప్రాణం పోసి వాటిని వాస్తవంలోకి తీసుకువచ్చి రంగు, రుచి, వాసనల్ని ఇనుమడింప చేసే శక్తి సామర్థ్యాలు మన చేతిలో వుండటం ఇప్పుడు ఈ భూమి పైవున్న మనందరి మహద్భాగ్యం. ఈ క్షణం ఈ భూమిపై నడుస్తూ, ఈ గాలిని పీలుస్తూ, ఇక్కడి నీటిని తాగుతూ,



ఆహారాన్ని స్వీకరిస్తున్న మనం నాటే ప్రతి నీలోత్పల మొక్క సాక్షాత్తు ఆ భూదేవి, ప్రకృతిమాత పార్వతీదేవి పాదపద్మాలకు మనం స్వయంగా సమర్పించే పుష్పం. అదే అసలైన పూజ. ఆయా దేవతలకు ఈవిధంగా మనం కృతజ్ఞతలు చెప్పడం మన కనీస ధర్మం. వాగ్దేవి మనకు ప్రసాదించిన ఈ దివ్యజ్ఞానాన్ని భూదేవి, పార్వతిలకు సమర్పిస్తున్నాం. ఈ త్రిశక్తులు సంతుష్టులై, తద్వారా యుగయుగాల వరకు మన పుడమి తల్లి చల్లగా వుండాలని కోరుకుంటూ..

*(సశేషం)*



ఎంతకాలం జీవించామన్నది కాదు ముఖ్యం; ఏమి సాధించామన్నదే ముఖ్యం.